సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

7

గురువారం । 11 । మే । 2023

గరిష్టం / కనిష్టం
41° / 26°

వాతావరణం
జిల్లాలో గురువారం పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగానే నమోదవుతాయి. ఉదయం నుంచే ఎండ తీవ్రత ఉంటుంది.

‘పది’లో ఢమాల్..

- జిల్లాలో పదో తరగతి ఫలితాల్లో 78.53 శాతం ఉత్తీర్ణత
- రాష్ట్రంలో 29వ స్థానంతోనే సరి
- 12,481 మంది పరీక్షలు రాయగా, 9,801 మంది పాస్
- సౌకర్యాలు మెరుగుపడుతున్నా తగ్గిన ఫలితాలు
- సబ్జెక్ట్ టీచర్ల కొరత, పర్యవేక్షణ లోపాలే కారణం!



జిల్లా విద్యాశాఖ కార్యాలయం

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో పదో తరగతిలో ఈయేడాది ఉత్తీర్ణత శాతం తగ్గింది. విద్యాశాఖ అత్తెసరు ఫలితాలతోనే సరిపెట్టుకుంది. ఈ ఏడాది బాలురు 6,087 మంది పరీక్షలు రాయగా, 4,630 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 6,394 మందికి 5,171 మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 12,481 మందికి 9,801 మంది ఉత్తీర్ణత సాధించారు. 78.53 శాతం ఉత్తీర్ణత నమోదయింది. బాలురు 76.06 శాతం, బాలికలు 80.87 శాతం ఉత్తీర్ణత సాధించగా, రాష్ట్రంలో జిల్లా 29వ స్థానంలో నిలిచింది. జిల్లాలో 49 మంది విద్యార్థులకు 10 జీపీఏ రాగా ఇందులో ఇద్దరు రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులు, మరొకరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని ఉన్నారు. కాగా గతేడాది జిల్లాలో 86.83 శాతం ఉత్తీర్ణత వచ్చింది. సబ్జెక్టు టీచర్ల కొరత, జిల్లా విద్యాధికారుల పర్యవేక్షణ లోపాలతోనే ఉత్తీర్ణతా శాతం పడిపోయిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రెండు జిల్లాలకు ఒక్కరే డీఈఓ ఉండటం కూడా మరో కారణంగా చెప్పుకోవచ్చు. ప్రస్తుతం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో దశల వారీగా అన్ని సౌకర్యాలు ఏర్పాటు అవుతున్నప్పటికీ విద్యార్థులను చదివించడంలో ఉపాధ్యాయులు, జిల్లా విద్యాధికారులు విఫలమైనట్లు కనిపిస్తోంది. గతేడాది నుంచి ఆంగ్ల మాధ్యమం సైతం అమలవుతున్న నేపథ్యంలో మరింత ఎక్కువగా ఫలితాలు, ఉత్తీర్ణత శాతం పెరగాల్సింది పోయి తగ్గడం జిల్లా విద్యాధికారుల పనితీరుకు నిదర్శనంగా చెప్పకోవచ్చు. గతేడాది పదో తరగతి విద్యార్థులకు స్పెషల్ క్లాసులలో పౌష్టికాహారం సైతం ప్రభుత్వం పంపిణీ చేయలేదు. ఈ ఏడాది స్నాక్స్ కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు ఒక్కరే డీఈఓ ఉండటం, జిల్లా కో–ఆర్డినేటర్లు నలుగురు సమన్వయం, పర్యవేక్షణ, పరిశీలన చేయడంలో విఫలం చెందారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కేజీబీవీల్లో 74.71శాతం ఉత్తీర్ణత..

జిల్లాలోని కేజీబీవీ పాఠశాలలు 14 ఉండగా ఈ ఏడాది 510 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. వీరిలో 381 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 74.71 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఆళ్లపల్లి, కరకగూడెం కేజీబీవీ పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. భద్రాచలం కేజీబీవీ పాఠశాల విద్యార్థిని జక్కుల స్ఫూర్తిశ్రీ 9.8 జీపీఏ సాధించి కేజీబీవీలలో టాపర్‌గా నిలిచింది.

36 పాఠశాలల్లో 100 శాతం ఫలితాలు..

జిల్లాలోని పదో తరగతికి సంబంధించి 301 ప్రభుత్వ, ప్రైవేటు, రెసిడెన్షియల్ పాఠశాలలు ఉండగా, 36 ప్రభుత్వ పాఠశాలలు వంద శాతం ఫలితాలు సాధించాయి. చుంచుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఇ.సాయినిపుణ, బీసీ గురుకుల పాఠశాల విద్యార్థిని ఎస్. వింధ్యశ్రీ 10 జీపీఏ సాధించి తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారు. నారాయణపురం(అశ్వారావుపేట) భవిత పాఠశాల విద్యార్థిని పి.సుస్మిత, 8 జీపీఏ, జూలూరుపాడు మండలం పాపకొల్లు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చదువుతున్న పి.జస్విక 8.7 జీపీఏ సాధించారు.

ఇల్లెందు: కాచనపల్లి, రొంపేడు, మామకన్ను, మర్కోడు, శంభునిగూడెం ఆశ్రమ పాఠశాలలు పదో తరగతి ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాయి.

మండలాల వారీగా ఫలితాలు

జిల్లాలోని 23 మండలాల్లో దమ్మపేట మండలం 92.17 శాతం ఉత్తీర్ణతతో మొదటి స్థానంలో నిలిచింది. 91.92 శాతం ఉత్తీర్ణతతో ఆళ్లపల్లి మండలం రెండో స్థానంలో నిలిచింది. 90.70 శాతంతో మూడో స్థానంలో అశ్వారావుపేట నిలవగా, 56.03 శాతం ఉత్తీర్ణతతో ములకలపల్లి మండలం చివరి స్థానంలో నిలిచింది. గతేడాది కూడా 95.94 శాతం ఉత్తీర్ణతతో దమ్మపేట మండలం మొదటిస్థానం సాధించింది.

26 వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చు

పదో తరగతి ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు ఈ నెల 26వ తేదీ వరకు పరీక్ష ఫీజును చెల్లించే అవకాశం ఉందని జిల్లా విద్యాధికారులు తెలిపారు. సప్లిమెంటరీ పరీక్షలు వచ్చే నెల 14వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

ఎంసెట్ ప్రశాంతం



పాల్వంచ: విద్యార్థుల హాల్‌టికెట్లు పరిశీలిస్తున్న సిబ్బంది



సుజాతనగర్: విద్యార్థుల పత్రాలను పరిశీలిస్తున్న నిర్వాహకులు

పాల్వంచ/సుజాతనగర్: పాల్వంచ అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో, సుజాతనగర్ మండలంలోని అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో తొలిరోజు బుధవారం నిర్వహించిన ఎంసెట్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. అగ్రికల్చర్ పరీక్షను రెండు విభాగాలుగా నిర్వహించారు. ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 3గంటల నుండి 6గంటల వరకు పరీక్షలు జరిపారు. పాల్వంచలో ఉదయం పరీక్షకు 100 మంది విద్యార్థులకు 96 మంది హాజరయ్యారు. నలుగురు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు 100 మందికి 98 మంది హాజరయ్యారని, ఇద్దరు గైర్హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వి.సుబ్బారావు తెలిపారు. పరీక్షలను ఏఎస్ఐ ప్రసాద్ రావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. సుజాతనగర్‌లో ఉదయం పరీక్షకు 125 మంది హాజరు కావలసి ఉండగా 119 మంది హాజరయ్యారు. ఆరుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు కూడా 125 మంది హాజరు కావాల్సి ఉండగా 120 మంది హాజరయ్యారు. ఐదుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష సమయానికంటే గంటన్నర ముందుగానే విద్యార్థులను లోపలికి అనుమతించారు. విద్యార్థులు తల్లిదండ్రులతో కళాశాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. కళాశాల బయట విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు కూర్చునేందుకు ఎటువంటి సౌకర్యాలు లేకపోవడంతో అవస్థలు పడ్డారు. ఎండాకాలం కావడంతో చెట్ల కింద సేద తీరుతూ ఉండాల్సి వచ్చింది. కనీసం టెంట్ అయినా ఏర్పాటు చేయలేదని తలిదండ్రులు పేర్కొన్నారు.

క్రీడల్లో పోలీసులు రాణించాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్పీ వినీత్

కొత్తగూడెంరూరల్: పోలీసులు క్రీడారంగంలో రాణించాలని ఎస్పీ వినీత్ సూచించారు. లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రాపురంలోని జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో బుధవారం నిర్వహించిన డిస్ట్రిక్ట్ పోలీస్ మాన్యువల్ స్పోర్ట్స్ మీట్ ముగింపు వేడుకల్లో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ క్రీడలు, వ్యాయామం నిత్య జీవితంలో భాగంగా ఉండాలని పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవాలని చెప్పారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ టి.సాయి మనో హర్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ విజయ్ బాబు, డీఎస్పీలు రెహమాన్, వెంకటేష్, రాఘవేంద్రరావు, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ పర్యటన ఖరారు.. ఆపై వాయిదా

భద్రాచలం: రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ గురువారం భద్రాచలంలో పర్యటించనున్నట్లు బుధవారం అధికారులు సమాచారం వెల్లడించారు. హైదరాబాద్ నుంచి హెలీకాప్టర్‌లో రానున్న ఆమె శ్రీ సీతారామ చంద్రస్వామిని దర్శించుకున్నాక ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన గిరిజనులకు ఏర్పాటుచేయనున్న ఆరోగ్య అవగాహన సదస్సులో పాల్గొంటారని, అనంతరం గిరిజన అభ్యుదయ భవన్‌లో గిరిజనుల సమస్యలు తెలుసుకునేందుకు ముఖాముఖి భేటీ అవుతారని తెలిపారు. కానీ గవర్నర్ పర్యటన వాయిదా పడినట్లు బుధవారం అధికారులు మరో ప్రకటన విడుదల చేశారు. గవర్నర్ మళ్లీ ఎప్పుడు వచ్చేది త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు.

పల్లె ప్రగతిపై నేడు కలెక్టర్ సమీక్ష

సూపర్‌బజార్(కొత్తగూడెం): పల్లె ప్రగతి కార్యక్రమాలపై గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఐడీఓసీలో నిర్వహించే సమీక్ష సమావేశానికి అధికారులు సమగ్ర సమాచారంతో రావాలని కలెక్టర్ అనుదీప్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఆర్‌డీఓ, డీపీఓ, జెడ్పీ సీఈఓ, డివిజనల్ పంచాయతీ అధికారులు, ఎంపీడీఓలు, ఎంపీఓలు సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

అడవులను కాపాడుదాం

తునికాకు బోనస్ చెక్కుల పంపిణీలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

దుమ్ముగూడెం/కరకగూడెం: అడవులను కాపాడి భావిత రాలకు మంచి భవిష్యత్తు అందించేందుకు అందరూ ముందుకు రావాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. బుధవారం దుమ్ముగూడెం మండలం ములకపాడు వైద్యశాల ఆవరణలో దుమ్ముగూడెం, చర్ల మండలాల తునికాకు కార్మికులకు, కరకగూడెం మండల కేంద్రంలో పినపాక నియోజకవర్గానికి చెందిన 43,616 మంది లబ్ధిదారులకు తునికాకు బోనస్ చెక్కులు పంపిణీ చేశారు. 2016 నుంచి 2021 వరకు పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్‌ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అడవుల సంరక్షణ మనందరం బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. అడవిలో లభించే తునికి ఆకు కూడా ఆదాయం తెచ్చి పెడుతుందని అన్నారు. జిల్లాకు సుమారు రూ.100 కోట్ల బోనస్ నిధులు విడుదలయ్యాయని, భద్రాచలం డివిజన్‌కు సుమారు రూ.27.56 కోట్లు, పినపాకకు రూ.33.6 కోట్ల బోనస్ విడుదలైందని తెలిపారు. కొందరికి చెక్కులను పంపిణీ చేసిన మంత్రి, మిగతావారికి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతుందని, రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు వారం రోజుల్లో జమ చేస్తామని వివరించారు. భద్రాచలం శాసనసభ్యుడు పొదెం వీరయ్య మాట్లాడుతూ పండ్లు ఫలాలను ఇచ్చే అడవిని కాపాడుకుందామని పేర్కొన్నారు. పోడు సాగుదారులకు పట్టాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఈ ప్రాంత ప్రజలు రుణపడి ఉంటారని అన్నారు. పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు మాట్లాడుతూ ప్రభుత్వం తునికి ఆకు కట్ట ధర రూ.2.05 నుంచి 3 రూపాయలకు పెంచిందని అన్నారు. పట్టాలు ఇచ్చాక ఇంకా ఎవరూ పోడు జోలికి పోవొద్దని సూచించారు. సీఎం కేసీఆర్ పినపాక నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించడంతో అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయని పేర్కొన్నారు. కాగా తమ సమస్యలు పరిష్కరించాలని 24 రోజులుగా సమ్మె చేస్తున్న వీఓఏలు మంత్రికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పీసీసీఎఫ్ ఆర్‌ఎం డోబ్రియల్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు, ఎస్పీ వినీత్, సీసీఎఫ్ డి. భీమ్లానాయక్, డీఎఫ్ఓ రంజిత్‌నాయక్, అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, ఆర్డీఓ రత్నకల్యాణం, ఎఫ్‌డీఓలు మస్బూద్ ఖాన్, దామోదర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, దుమ్ముగూడెం జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, దుమ్ముగూడెం, కరకగూడెం ఎంపీపీలు రేసు లక్ష్మి, రేగా కాళిక, అటవీ శాఖ సిబ్బంది కనకమ్మ, శోభన్, తేజస్విని పాల్గొన్నారు.



చెక్కు విడుదల చేస్తున్న మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ఎమ్మెల్యేలు పొదెం వీరయ్య, కాంతారావు, కలెక్టర్ అనుదీప్, పీఓ గౌతమ్, పీసీసీఎఫ్ ఆర్‌ఎం డోబ్రియల్ తదితరులు

రామయ్య భూములను రక్షిస్తాం..

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానానికి వివిధ ప్రాంతాల్లో ఉన్న భూములను కాపాడుతామని రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. బుధవారం శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని ఆయన దర్శించుకుని పూజలు చేశారు. మంత్రికి ఆలయ ఈఓ ఎల్.రమాదేవి, అర్చకులు సంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ ఏపీలోని యటపాక మండలం పురుషోత్తపట్నంలో ఉన్న రామాలయ భూముల రక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని, ఆక్రమణల నుంచి భూములను కాపాడాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఇప్పటికే కోరామని తెలిపారు. భూములను స్వాధీనం చేసుకునే దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయి, ఇప్పటికే అక్కడ అక్రమ కట్టడాలను కూల్చివేసినట్లు వివరించారు. మరోవైపు భద్రాద్రి ఆలయ అభివృద్ధికి సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు.


ధ్వజస్తంభం వద్ద నమస్కరిస్తున్న మంత్రి ఇంద్రకరణ్

క్లుప్తంగా

శాస్త్రోక్తంగా రామయ్య కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: శ్రీసీతారామ చంద్రస్వామివారి నిత్యకల్యాణం బుధవారం కమనీయంగా జరిగింది. బేడా మండపంలో కొలువుదీరిన రామయ్యకు విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం గావించారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. బుధవారం సందర్భంగా స్వామి వారికి స్నపన తిరుమంజనం జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

'బహిష్కరించే హక్కు లేదు'

ఇల్లెందు: గత 24 ఏళ్లుగా తుడుందెబ్బ సంఘం బలోపేతం కోసం కృషి చేస్తూ జాతీయ కన్వీనర్ స్థాయికి ఎదిగిన తనను బహిష్కరించే హక్కు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంపిడి వెంకటేశ్వర్లుకు లేదని ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ) జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య వెల్లడించారు. ఇల్లెందులో బుధవారం ఆయన మాట్లాడుతూ తాను ఎన్నికల వైపు మొగ్గు చూపుతున్నట్లు అసత్య ప్రచారం చేస్తూ బహిష్కరించడం గర్హనీయమని పేర్కొన్నారు. నాయకులు వట్టం కన్నయ్య, పూనెం బాలకృష్ణ, దుగ్గారపు వీరభద్రం, సూర్నబాక రామారావు, వట్టం నాగేందర్, ఈసం కృష్ణ పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్ష విజయవంతం


సింగరేణి పాఠశాల పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని నాలుగు కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 6,7,8వ తరగతుల్లో మిగిలిపోయిన సీట్లకు ప్రవేశ పరీక్ష నిర్వహించారు. పరీక్షలను జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా రెవెన్యూ అధికారులు పర్యవేక్షించారు. మొత్తం 990 మంది విద్యార్థులకు 826 మంది హాజరుకాగా, 164 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 83.4శాతం హాజరు నమోదైందని జిల్లా కన్వీనర్ వీవీ కృష్ణవేణి తెలిపారు.

పంజాగుట్ట ఏసీపీకి కేంద్ర ప్రభుత్వ మెడల్



అవార్డు అందుకుంటున్న ఏసీపీ మోహన్‌కుమార్

దమ్మపేట: హైదరాబాద్‌లో పంజాగుట్ట ఏసీపీగా పనిచేస్తున్న, దమ్మపేట మండలం పట్వారిగూడెం గ్రామానికి చెందిన శ్రీరాముల మోహన్‌కుమార్ యూనియన్ హోం మినిస్టర్ మెడల్ అందుకున్నారు. 2019లో కేంద్రం హోం మంత్రిత్వ శాఖ ఉత్తమ దర్యాప్తు అధికారిగా మోహన్‌కుమార్‌ను ఎంపిక చేసింది. కోవిడ్ కారణంగా అవార్డుల ప్రధానం వాయిదా పడింది. బుధవారం హైదారబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ, డీజీపీ అంజనీకుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా పట్వారిగూడెం గ్రామానికి చెందిన పలువురు హర్షం వ్యక్తం చేశారు.

సీతమ్మసాగర్ పనులు ఆపాలని ఆందోళన


అమ్మగారిపల్లి వద్ద ఆందోళన నిర్వహిస్తున్న పిటీషనర్లు

అశ్వాపురం: నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఉత్తర్వులను భేఖాతరు చేస్తూ సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్ట్ నిర్మాణ పనులు సాగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుదవారం ప్రాజెక్ట్ నిర్మాణ ప్రాంతంలో పిటీషనర్లు ఆందోళన నిర్వహించారు. ఎన్‌టీజీ కోర్టులో పిటీషన్లు వేసిన తెల్లం నరేష్, బూర లక్ష్మీనారాయణ మరికొందరు అమ్మగారిపల్లిలోని ప్రాజెక్ట్ నిర్మాణ ప్రాంతంలో ఆందోళన నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య మాట్లాడు తూ పర్యావరణ అనుమతులతో పాటు అటవీశాఖ అనుమతులు లేకుండా పనులు చేస్తుండటంతో సౌత్ జోన్ ఎన్‌టీజీ కోర్టు (చెన్నై)లో పిటీషన్ దాఖలు చేయడంతో పనులను తక్షణమే నిలిపివేయాలంటూ గత మార్చి 24న కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం ఖాతరు చేయకుండా పనులు సాగిస్తోందని ఆరోపించారు.

లోక్ అదాలత్‌పై సమీక్ష



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి

కొత్తగూడెంటౌన్: వచ్చే నెల 10న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్న నేపథ్యంలో బుధవారం జిల్లా కోర్టు కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా పోలీసు అధికారులతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి సమీక్ష జరిపారు. రాజీకాదలచిన పెండింగ్ క్రిమినల్ కేసులు, ఇ-పిటీ కేసులు వివరాలను ఠాణాల వారీగా అడిగి తెలుసుకున్నారు. సమన్వయంతో పనిచేసి లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని సూచించారు. కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, ఏపీపీలు విశ్వశాంతి, లావణ్య, ఇతర పోలీస్, ఎక్సైజ్ ఆఫీసర్లతోపాటు లైజన్ ఆఫీసర్ వీరబాబు, హరిగోపాల్, న్యాయవాది మెండు రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ శిక్షణకు ఎంపిక


బోద శశ్విత

టేకులపల్లి: టేకులపల్లి మండల కేంద్రానికి చెందిన బోద బాలు నాయక్-జ్యోతి దంపతుల కుమార్తె శశ్విత జేఎన్‌వీ బెంగళూరు క్యాంపస్‌లో జేఈఈ శిక్షణకు ఎంపికైంది. విద్యార్థిని పాలేరు నవోదయ విద్యాలయలో పదో తరగతి(సీబీఎస్‌ఈ)లో చదివి విశేష ప్రతిభ చూపింది. దీంతో దక్షణ ఫౌండేషన్ నిర్వాహకులు దేశవ్యాప్తంగా 500 మందిని శిక్షణకు ఎంపిక చేయగా, వారిలో శశ్విత చోటుదక్కించుకుంది. రెండేళ్లపాటు స్కాలర్‌షిప్‌తో ఉచితంగా శిక్షణ అందించనున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పలువురు అభినందించారు.

ఎండ వేడికి చనిపోయిన చేపలు


తుమ్మల చెరువులో చనిపోయిన చేపలు

అశ్వాపురం: మండలంలోని తుమ్మల చెరువులో మత్స్యకారులు వల వేసి పట్టిన చేపలను అలాగే ఉంచడంతో అవి ఎండ వేడికి చనిపోయాయి. ఈ ఘటన బుధవారం చోటుచేసుకుంది. రెండు రోజులుగా మత్స్య సొసైటీ సభ్యులు ఈ చెరువులో చేపలు పడుతుండగా, వాటిని స్థానికులకు విక్రయించకుండా బయటి ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో స్థానికులు చేపలు ఇక్కడే విక్రయించాలని, మిగిలినవి మాత్రమే బయటకు తరలించాలని పట్టుబట్టారు. అయితే, మత్స్య సొసైటీ సభ్యులు మంగళవారం చేపలను పట్టేందుకు వలలు వేసినప్పటికీ వాటిని బయటకు తీయకుండా అలాగే ఉంచడంతో ఎండ వేడిమికి అవి చనిపోయాయి.

మానుకోట పోలీసుల అదుపులో 'గూడెం' వ్యాపారి

కొత్తగూడెంఅర్బన్: చోరీ చేసిన బంగారాన్ని కొత్తగూడెం గణేశ్‌టెంపుల్ ఏరియాలోని ఓ జ్యూయలరీ దుకాణం యజమానికి విక్రయించినట్లు నిందితుడు చెప్పగా సదరు వ్యాపారిని మానుకోట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహబూబాబాద్ పోలీసులు ఇటీవల ఒక దొంగను అదుపులోకి తీసుకుని విచారించగా.. తాను అపహరించిన బంగారాన్ని కొత్తగూడెం గణేశ్‌టెంపుల్ ఏరియా సమీపంలోని మెయిన్ రోడ్డులో ఉన్న జ్యూయలరీ దుకాణంలో అమ్మినట్లు తెలిపారు. దీంతో మహబూబాబాద్ పోలీసులు రికవరీ కోసం రెండు రోజుల కిందట కొత్తగూడెం చేరుకుని జ్యూయలరీ షాపు యజమానిని మహబూబాబాద్ తీసుకెళ్లారు. కాగా, ఈ కేసులో బంగారం రికవరీపై ఇంకా విచారణ సాగుతోందని కొత్తగూడెం త్రీటౌన్ పోలీసులు బుధవారం వెల్లడించారు.

టేకు కలప స్వాధీనం

ఇల్లెందురూరల్: మండలంలోని వీరాపురం వద్ద టాటాఏస్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న టేకు కలపను కొమరారం రేంజ్ అటవీశాఖ అధికారులు బుధవారం పట్టుకున్నారు. వీరాపురం వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అటుగా వచ్చిన టాటాఏస్ వాహనంలో టేకు కలపను తరలిస్తున్నట్లు గుర్తించి వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. అందులో నిల్వ ఉన్న దుంగల విలువ రూ.1,07,294గా అటవీశాఖ అధికారులు నిర్ధారించారు. కలపను ఇల్లెందు పట్టణంలోని సత్యనారాయణపురం గ్రామానికి చెందిన బాసిని నరేశ్, సొల్ల యలమంచి, కుంట సతీశ్ కలిసి తరలిస్తున్నారని వారు చెప్పారు. కాగా, పట్టుబడిన కలపను ఇల్లెందు కలప యార్డుకు తరలించారు. అక్రమంగా కలప తరలిస్తే కఠిన చర్యలు తప్పవని అటవీశాఖ అధికారులు హెచ్చరించారు. తనిఖీల్లో కొమరారం ఎఫ్‌ఆర్‌ఓ శ్రీనివాస్, డీఆర్‌ఓ జయరాం, ఎఫ్ఎస్‌ఓ రాజేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా...

అకాల వర్షాలతో పంట నష్టం

- రైతు ఆత్మహత్య


రాజు (ఫైల్)

టేకుమట్ల(రేగొండ): అకాల వర్షాలతో పంట నష్టం, అప్పుల బాధ తాళలేక ఒక రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం తిరుమలగిరి గ్రామంలో బుధవారం జరిగిన ఈ సంఘటనపై పోలీసులు అందించిన వివరాలివి. తిరుమలగిరి గ్రామానికి చెందిన రైతు సుంకరి రాజు (35) తనకున్న రెండెకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటున్నాడు. ఈ ఏడాది మిర్చి తోట వేయగా అకాల వర్షాలకు పంట దెబ్బ తింది. పంట కోసం చేసిన అప్పులు తాళలేక మంగళవారం తన ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

ఉపాధికి రక్షణ కవచం!

ఏపీలోని పాల సముద్రం వద్ద బీఈఎల్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ కాంప్లెక్స్

- 914 ఎకరాల్లో ఐదు దశల్లో నిర్మాణం
- రాడార్లు, మిస్సైల్, సబ్‌మెరైన్ పరికరాల తయారీ, టెస్టింగ్
- తొలి దశలో రూ.384 కోట్లతో యూనిట్
- స్థానిక యువతకు భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- ఎంఓయూతో చేతులు దులిపేసుకున్న గత సర్కారు
- పట్టుబట్టి పరిశ్రమ ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకున్న ప్రస్తుత ప్రభుత్వం



సాక్షి, అమరావతి : పారిశ్రామికంగా ఆంధ్రప్రదేశ్ శరవేగంగా అడుగులు ముందుకు వేస్తోంది. ఓ వైపు పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు.. మరో వైపు సెజ్ (స్పెషల్ ఎకనామిక్ జోన్)లు, వాటిలో భారీ పరిశ్రమల ఏర్పాటుతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. వీటికి అనుబంధంగా ఏర్పాటయ్యే పరిశ్రమల ద్వారా లక్షల సంఖ్యలో యువతకు ఉపాధి మార్గాలు చేరువ కానున్నాయి. ఈ నేపథ్యంలో సత్యసాయి జిల్లా పాల సముద్రం వద్ద 914 ఎకరాల్లో కేంద్ర ప్రభుత్వ రక్షణ రంగానికి చెందిన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్) ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ కాంప్లెక్స్ పనులు వేగం అందుకున్నాయి. ఐదు దశల్లో ఈ యూనిట్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే తొలి దశలో రూ.384 కోట్లతో అభివృద్ధికి బోర్డు ఆమోదం తెలిపింది. త్వరలో జరిగే బోర్డు సమావేశంలో మిగిలిన దశలకు సంబంధించి ఆమోదం లభించనుందని బీఈఎల్ అధికారులు తెలిపారు. ఈ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ కాంప్లెక్స్‌లో రాడార్, మిస్సైల్, సబ్‌మెరైన్లకు సంబంధించిన పరికరాలను అభివృద్ధి చేయడమే కాకుండా వీటిని పరీక్షించేలా టెస్టింగ్ సెంటర్లను కూడా ఏర్పాటు చేస్తున్నారు. తొలి దశకు సంబంధించి క్షిపణుల అసెంబ్లింగ్, ఇంటిగ్రేషన్, టెస్టింగ్ కార్యకలాపాలకు అవసరమైన మౌలిక వసతులను రూ.148 కోట్లతో అభివృద్ధి చేయడానికి ఆసక్తిగల సంస్థల నుంచి బిడ్లను ఆహ్వానించింది.

డిఫెన్స్ హబ్‌గా ఏపీ

దేశ రక్షణ అవసరాల తయారీ హబ్‌గా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవింద రెడ్డి తెలిపారు. ఇప్పటికే కేంద్ర రక్షణ సంస్థ 914 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ కాంప్లెక్స్ అభివృద్ధి చేస్తుండగా ఏపీఐఐసీ కూడా 1,200 ఎకరాల్లో ఏపీ ఎయిరో స్పేస్ అండ్ డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ (ఏపీ–ఏడీఈ) పార్క్‌ను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి త్వరలో జరిగే ఏపీఐఐసీ బోర్డు సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నామని చెప్పారు. ఈ రెండు ప్రాజెక్టుల రాకతో శ్రీ సత్యసాయి జిల్లాతోపాటు రాష్ట్రం రక్షణ రంగ ఉత్పత్తులకు తయారీ కేంద్రంగా తయారవుతుందన్నారు. ఈ రెండు ప్రాజెక్టుల రాకతో ప్రత్యక్షంగా 2,800 మందికి, పరోక్షంగా 8,000 మంది వరకు ఉపాధి లభిస్తుంది. యాంకర్ యూనిట్‌గా బీఈఎల్ భారీ ప్రాజెక్టును చేపడుతుండటంతో అనేక అనుబంధ కంపెనీలు, ఎంఎస్‌ఎంఈలు ఏర్పాటు కానున్నాయి.

చకచకా అనుమతులు

గత ప్రభుత్వ అసమర్థ నిర్వాకానికి బీఈఎల్ ప్రాజెక్టు ఒక ఉదాహరణ. అత్యంత ప్రతిష్టాత్మకమైన క్షిపణులు, ఇతర రక్షణ రంగ ఉత్పత్తుల తయారీ యూనిట్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేయడానికి 2016లోనే బీఈఎల్ ముందుకు రాగా, రాష్ట్ర ప్రభుత్వ అలసత్వంతో ఆ ప్రాజెక్టు ఆగిపోయింది. భూమి కన్వర్షన్, పర్యావరణ అనుమతులు తేవడంలో అప్పటి ప్రభుత్వం అలసత్వం ప్రదర్శించడంతో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఈ ప్రాజెక్టుపై దృష్టి సారించి, త్వరితగతిన అనుమతులు వచ్చేలా చర్యలు చేపట్టారు.

నీకు మైండ్ ఉందా.. నువ్వు నోర్మూసుకో

- ఎమ్మెల్యే పొదెం వీరయ్య వర్సెస్ విప్ రేగా కాంతారావు
- మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి సమక్షాన తీవ్రవాగ్వాదం
- రాయలేని భాషలో తిట్లదండకం
- ఒకరిపైకి మరొకరు దూసుకొచ్చిన వైనం


ఒకరిపైకి ఒకరు దూసుకొస్తున్న విప్ కాంతారావు, ఎమ్మెల్యే వీరయ్య

దుమ్ముగూడెం: తునికాకు బోనస్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్యల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. మాటామాటా పెరిగి ఒకరిపైకి ఒకరు దూసుకురావడంతో పాటు గల్లాలు పట్టుకునేందుకు రెడీ అయ్యారు. పరిస్థితి చేయిదాటుతుండటంతో అక్కడే ఉన్న కలెక్టర్, ఎస్పీ, అటవీ అధికారులు సర్దిచెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం ములకపాడులో బుధవారం తునికాకు బోనస్ చెక్కుల పంపిణీకి సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, విప్ కాంతారావు, ఎమ్మెల్యే వీరయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ మూడో సారి కూడా కేసీఆర్ సీఎం అవుతారని, రాబోయే ఎన్నికల్లో భద్రాచలం నుంచి గెలిచేది బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థేనంటూ తన ప్రసంగం కొనసాగించారు. దీనికి వేదికపై ఉన్న భద్రాచలం ఎమ్మెల్యే వీరయ్య(కాంగ్రెస్) జోక్యం చేసుకుని ఇది ప్రభుత్వ కార్యక్రమమని..ఇక్కడ రాజకీయాలెందుకంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే కాంతారావు మరింత దూకుడుగా ప్రసంగం కొనసాగిస్తూ ప్రతిపక్షాలనుద్దేశించి కొన్ని అనుచిత వ్యాఖ్యలు చేశారు. ప్రసంగం ముగించి తన సీట్లో కూర్చునే సమయంలోనూ ప్రభుత్వ పథకాల గురించి చెబుతుంటే బాధెందుకు అంటూ పొదెంను ఉద్దేశించి అన్నారు. ఇందుకు వీరయ్య 'నువ్వు నా నియోజకవర్గానికి వచ్చి ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే కుదరదంటూ'హెచ్చు స్వరంతో బదులిచ్చారు. దీంతో నువ్వెంత అంటే నువ్వెంత అంటూ ఒకరితో ఒకరు వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో నీకు మైండ్ ఉందా అంటూ పొదెం అనగా.. నువ్వు నోర్మూసుకో అంటూ విప్ అన్నారు. ఇలా అభ్యంతరకమైన పదాలతో దూషించుకుంటూనే ఒకరిపై ఒకరు దూసుకొచ్చారు. వేదికపై ప్రసంగించేందుకు సిద్ధమైన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నిశ్చేష్టుడై చూస్తుండిపోయారు. ఇద్దరూ భౌతికదాడులకు దిగే విధంగా పరిస్థితి నెలకొనడంతో అక్కడే ఉన్న కలెక్టర్ అనుదీప్, పీసీసీఎఫ్ డోబ్రియల్ కల్పించుకుని రేగా చేయి పట్టుకుని వెనక్కి తీసుకెళ్లి కూర్చోబెట్టగా ఎస్పీ వినీత్ ఎమ్మెల్యే పొదెంను సముదాయించడంతో గొడవ సద్దుమణిగింది.

గుడాటిపల్లి నిర్వాసితుల ఇళ్ల కూల్చివేత

బలవంతంగా ఖాళీ చేయిస్తున్నారని ఆరోపణ


గుడాటిపల్లిలో ఇళ్లను ఖాళీ చేసి సామాన్ల తరలింపు

అక్కన్నపేట (హుస్నాబాద్): సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గుడాటిపల్లి వద్ద నిర్మిస్తున్న గౌరవెల్లి జలాశయం పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఇళ్లు ఖాళీ చేయాలని రెండు రోజులుగా గుడాటిపల్లి వాసులకు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. జలాశయంలో మొత్తం 687 ఇళ్లు ముంపునకు గురికాగా, నిర్వాసితులు ఇప్పటికే 655 ఇళ్లు ఖాళీ చేశారు. మరో 32 ఇళ్లలో బుధవారం సాయంత్రం 26 ఇళ్లను పోలీసుల పహారా మధ్య రెవెన్యూ అధికారులు కూల్చివేసి నిర్వాసితులను తరలించారు. రాత్రి మిగిలిన మొత్తం ఇళ్లను కూల్చేయనున్నారు. పరిహారం ఇవ్వకుండా బలవంతంగా ఇళ్లు ఖాళీ చేయిస్తున్నారని నిర్వాసితులు ఆరోపించారు. గ్రామస్తులను భయపెట్టి ఇళ్లను కూల్చుతున్నారని సర్పంచ్ బద్దం రాజిరెడ్డి ఆరోపించారు.

భూ నిర్వాసితుడి ఆత్మహత్యాయత్నం

గుడాటిపల్లి గ్రామానికి చెందిన భూ నిర్వాసితుడు బద్దం మల్లారెడ్డి బుధవారం సాయంత్రం డీజిల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేయగా.. పోలీసులు అడ్డుకున్నారు. నిర్వాసితుడైన మల్లారెడ్డి తల్లికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజ్ కింద పరిహారం, మల్లారెడ్డికి 20 గుంటల భూమికి పరిహారం రావల్సి ఉంది. మనస్తాపానికి గురైన మల్లారెడ్డి.. పరిహారం చెల్లించకుండా ఇళ్లు ఖాళీ చేయడం ఏమిటని పోలీసులను ప్రశ్నిస్తూ ఒంటిపై డీజిల్ పోసుకున్నాడు. దీంతో పోలీసులు నిర్వాసితుడిని స్నానం చేయించి తొలుత పోలీస్‌స్టేషన్‌కు.. అనంతరం ఇంటికి పంపించారు.

జగిత్యాల జిల్లాలో హైకోర్టు న్యాయమూర్తుల పర్యటన


హైకోర్టు న్యాయమూర్తి ఈవీ.వేణుగోపాల్ నివాసంలో హైకోర్టు న్యాయమూర్తులు, జిల్లా జడ్జి, కలెక్టర్, సీపీ

బీరప్ప ఉత్సవాలకు హాజరు కొండగట్టు అంజన్న సన్నిధిలో పూజలు

జగిత్యాలజోన్/కరీంనగర్ క్రైం: హైకోర్టుకు చెందిన 13 మంది న్యాయమూర్తులు బుధవారం జిల్లాలో పర్యటించారు. జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ పి.శ్రీసుధ, జస్టిస్ ఎం.లక్ష్మణ్, జస్టిస్ ఎస్.తుకారాంజీ, జస్టిస్ పి.మాధవిదేవి, జస్టిస్ సూరేపల్లి నంద, జస్టిస్ అనుపమ చక్రవర్తి(అడ్మినిస్ట్రేటివ్ జడ్జి), జస్టిస్ ఎ.సంతోష్‌రెడ్డి, జస్టిస్ ఈవీ వేణుగోపాల్, జస్టిస్ కె.శరత్, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు, జస్టిస్ శ్రవణ్‌కుమార్ తదితరులు తొలుత హైదరాబాద్ నుంచి ప్రత్యేక ఎస్కార్ట్‌తో కొండగట్టు చేరుకున్నారు. అంజన్నను దర్శించుకుని కాసేపు ఆలయ అతిథి గృహంలో సేదతీరారు. ఆ సమయంలో జగిత్యాల బార్ అసోసియేషన్ సభ్యులు వారిని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తి పుల్ల కార్తీక్ ఆహ్వానం మేరకు జగిత్యాలలో జరిగిన బీరప్ప ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ, సబ్ జడ్జి ప్రసాద్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనిజ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటిపల్లి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చీటి రామకృష్ణారావు, కోశాధికారి కట్కం చంద్రమోహన్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. అక్కడ్నుంచి హైకోర్టు న్యాయమూర్తులు కరీంనగర్‌లోని హైకోర్టు జడ్జి ఈవీ వేణుగోపాల్ నివాసానికి చేరుకున్నారు. అక్కడ వీరికి జిల్లా జడ్జి బి.ప్రతిమ, కలెక్టర్ ఆర్వీ కర్ణన్, సీపీ ఎల్.సుబ్బారాయుడు ఘన స్వాగతం పలికారు.

ధాన్యానికి నిప్పు పెట్టి హైవేపై రైతుల నిరసన


జాతీయ రహదారిపై నిరసన తెలుపుతున్న రైతులు

స్టేషన్‌ఘన్‌పూర్: రైస్‌మిల్లర్లు, అధికారులు కుమ్మక్కై తమ జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపిస్తూ జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిపై బుధవారం రైతులు ధాన్యం బస్తాలకు నిప్పు పెట్టి నిరసన తెలిపారు. ప్రభుత్వానికి, మిల్లర్లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతులు నీల గట్టయ్య, గాండ్ల రాజు, గాండ్ల శోభన్‌బాబు తదితరులు విలేకరులతో మాట్లాడారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో రోజూ హమాలీలు బస్తాకు 41 కిలోల 300 గ్రాములు కాంటా వేస్తున్నారని తెలిపారు. ధాన్యం నాణ్యత లేదనే సాకుతో మిల్లర్లు బస్తాలో 42 కిలోలే పెట్టాలని కొర్రీలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రోజులుగా ఘన్‌పూర్ ఐకేపీ సెంటర్‌లో కొనుగోళ్లు కావడంలేదని, తడిసిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెబుతుండగా మిల్లర్లు,అధికారులు కుమ్మక్కై రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ధర్నాకు వైఎస్సార్‌టీపీ జిల్లా నాయకుడు ఊరడి శ్రీనివాస్ హాజరై మద్దతు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రైతులకు నచ్చజెప్పి రాస్తారోకోను విరమింపచేశారు.

జిల్లా వార్తలు

ఉపాధి పనుల పరిశీలన


ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం గట్టుమళ్ల గ్రామంలోని ఉపాధి హామీ పనుల్లో భాగంగా ఎంఐ ట్యాంకు పనులను డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ కూలీలు నాలుగు గంటలపాటు పని చేయాలని సూచించారు. ఎండలు అధికంగా ఉన్న కారణంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్, సర్పంచ్ రమేష్, ఈసీ సత్యనారాయణ, టీఏలు వజ్జ శ్రీను, గుగులోతు నాగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన తోటల పరిశీలన


ఉద్యాన తోటలను పరిశీలిస్తున్న అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉద్యాన, వ్యవసాయ జిల్లా అధికారులు జినుగు మరియన్న, కొర్స అభిమన్యుడు, ఇతర అధికారులు 3వ రోజు ఉద్యాన పంటల సాగును పరిశీలించారు. బుధవారం పద్మాపురంలో ఆల్ స్పయిస్ (జాజికాయ, లవంగ, యాలుక లక్షణాలు కలిగి నవి) తోటలను, లిట్చి తోటలను సందర్శించారు. కాఫీ, పసుపు, మిరియాలు, యాలుక తదితర ఆర్గానిక్ ఉత్పత్తుల స్టాల్‌ను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.

కేటీపీఎస్ యాష్ పాండ్‌లో పైపులు చోరీ

పాల్వంచ: కేటీపీఎస్ యాష్ పాండ్‌లో పైపులు చోరీపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. కేటీపీఎస్ 5వ దశ కర్మాగారానికి చెందిన యాష్ పాండ్‌లో మంగళవారం రాత్రి పైపులు చోరీకి గురయ్యాయి. దీంతో బుధవారం ఏఈ ఎ.బాబూరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు రూ.13 వేల విలువైన పైపులను గుర్తుతెలియని వ్యక్తులు చేసినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రవీణ్ తెలిపారు.

కేసీఆర్ పాలనలో రైతుల కన్నీళ్లు..

- హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్
- ఖమ్మం జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పరిశీలన


గోల్‌తండాలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్, నాయకులు

తిరుమలాయపాలెం/కూసుమంచి/నేలకొండపల్లి: వడగండ్ల వానలు, అకాల వర్షాలతో వరి పంట పూర్తిగా నేలమట్టమై తీవ్ర నష్టం జరగగా... మిగిలిన పంటను అష్టకష్టాలకోర్చి కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే నెల గడిచినా కాంటా వేయడం లేదని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆరోపించారు. కేసీఆర్ పాలనలో రైతులకు కన్నీళ్లు, కష్టాలే తప్ప ఏ మాత్రం లాభం జరగడం లేదని మండిపడ్డారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం, కూసుమంచి, నేలకొండపల్లి మండలాల్లో బీజేపీ నేతలతో కలిసి పర్యటించిన ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. రైతును రాజుగా చేస్తున్నామని ఇతర రాష్ట్రాల్లో గొప్పలు చెప్పుకుంటున్న కేసీఆర్‌కు తెలంగాణలో రైతుల గోస కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు కుటుంబాలతో జాగారం చేస్తుండగా ఆత్మీయ సమ్మేళనాల పేరుతో మంత్రులు, ఎమ్మెల్యేలు దావత్ చేసుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ నేతృత్వాన రైతుల కష్టాలను తెలుసుకునేందుకు వస్తున్నారనే సమాచారంతో అధికారులు హడావిడి చేసి బస్తాలు ఇచ్చి కాంటాలు వేస్తున్నారని తెలిపారు. రైతు బంధు పేరుతో ఎకరాకు రూ.5వేలు ఇస్తున్నా రూ.10వేల నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న జిల్లాలైతే ప్రజల సమస్యలను నేరుగా వినేందుకు కలెక్టర్లకు అవకాశం ఉందని చెబుతుండగా.. రైతుల బాధలు కలెక్టర్‌కు ఎందుకు కనిపించడం లేదోనని అన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ధాన్యం అమ్ముకునేందుకు తాము పడుతున్న కష్టాలను ఈటల ఎదుట ఏకరువు పెట్టారు. కాగా, కూసుమంచిలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మె శిబిరాన్ని ఈటల సందర్శించి మాట్లాడారు. ఉద్యోగుల జీవితాలతో ఆడుకోవడం, మాట ఇచ్చి తప్పడం కేసీఆర్‌కు అలవాటేనని ఆరోపించారు. ఉద్యోగుల విషయంలో పెద్దన్న పాత్ర పోషించాల్సిన టీఎన్జీఓ సంఘాలు సమ్మెపై స్పందించకపోవటం శోచనీయమన్నారు. ఈకార్యక్రమాల్లో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, నాయకులు మేక సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'దళిత బంధు'లో అక్రమాలు జరగలేదు..

ప్రజావాణిలో ఫిర్యాదుపై రెండో దఫా విచారణ

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న దళిత బంధు పథకం కింద ఓ లబ్ధిదారుడికి మంజూరు చేసిన యూనిట్ దుర్వినియోగం కాలేదని ఆర్థిక లావాదేవీలే తప్ప అక్రమాలు జరగలేదంటాని విచారణాధికారులు తేల్చారు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని నారంవారిగూడెం గ్రామానికి చెందిన దాసరి నాగరత్నంకు దళిత బంధు పథకం కింద రూ.10 లక్షలు మంజూరు కాగా, తన నుంచి స్థానిక బీఆర్‌ఎస్ యూత్ నాయకుడితోపాటు, దళిత సంక్షేమ సంఘం నాయకుడు కలిసి డబ్బులు వసూలు చేసినట్లు బాధితురాలు ఆరోపించిన సంగతి తెలిసిందే. దీనిపై ఆమె పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించగా పత్రికల్లో వచ్చిన కథనాలతో వారం రోజుల కిందట స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సంజీవరావు విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే. కాగా, ఈ విచారణతో తనకు న్యాయం జరగలేదని, తిరిగి సోమవారం జరిగిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ అనుదీప్‌ను కలిసి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా కలెక్టర్ దీనిపై మరోసారి విచారణకు ఆదేశించగా, బుధవారం ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సంజీవరావుతోపాటు దళిత బంధు పథకం ఇన్‌చార్జ్, జిల్లా పరిశ్రమల మేనేజర్ సీతారాంనాయక్ ఆధ్వర్యంలో ఇరు వర్గాలను పిలిచి ఎంపీడీఓ కార్యాలయంలో వేర్వేరుగా విచారణ నిర్వహించారు. విచారణ ముగిసిన తర్వాత వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. దళిత బంధు యూనిట్‌లో అక్రమాలు జరగలేదని, కేవలం ఆర్థిక లావాదేవీలేనని తేల్చినట్లు చెప్పారు. దీంతో ఈ విచారణ తూతూమంత్రంగా సాగుతోందని, అధికార పార్టీ నేతలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇంటర్ ఫెయిలవడంతో ఆత్మహత్య

కారేపల్లి: ఇంటర్ ఫెయిల్ అయ్యాననే మనస్తాపంతో పురుగులమందు తాగి ఓ విద్యార్థిని చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. కారేపల్లి మండలం సూర్యతండా గ్రామానికి చెందిన అజ్మీరా బాన్‌సింగ్ కుమార్తె స్పందన (16) కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల సీఈసీ మొదటి సంవత్సరం పరీక్షలు రాసింది. మంగళవారం వెల్లడైన ఫలితాల్లో ఆమె ఫెయిల్ కావడంతో మంగళవారం సాయంత్రమే ఎలకల మందు తాగడమే కాక ఇంట్లో ఉన్న బీపీ టాబ్లెట్లు అధిక మోతాదులో మింగింది. కాసేపటికి గుర్తించిన కుటుంబీకులు ఆమెను ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ పి.రామారావు తెలిపారు.

ముగ్గురు యువకులను కాపాడిన ఫొటోగ్రాఫర్లు


యువకుడిని ఒడ్డుకు చేర్చుతున్న ఫొటోగ్రాఫర్లు

భద్రాచలంఅర్బన్: ముగ్గురు యువకులు గోదావరిలో స్నానం చేస్తూ, నీట మునుగుతుండగా ఫొటోగ్రాఫర్లు రక్షించారు. బుధవారం ముగ్గురు యువకులు భద్రాచలం వద్ద గోదావరిలో స్నానానికి దిగారు. లోతును అంచనా వేయకుండా ముందుకు వెళ్లగా నీటిలో మునిగారు. అదే సమయంలో గోదావరి ఘాట్ వద్ద ఉన్న ఫొటోగ్రాఫర్లు లక్ష్మణ్, ప్రసాద్‌తో పాటు మరికొందరు ప్రాణాలకు తెగించి ఆ యువకులను కాపాడి ఒడ్డుకు చేర్చారు. కాగా గోదావరిలో స్నానానికి వెళ్లి పలువురు మృత్యువాత పడిన సంఘటనలు అనేకం చోటుచేసుకుంటున్నాయని, అధికారులు స్పందించి రక్షణ చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

గుండాల, ఆళ్లపల్లిలో మెరుగైన ఫలితాలు


వంద శాతం ఉత్తీర్ణత సాధించిన కాచనపల్లి ఆశ్రమ పాఠశాల


గుండాల: ఏజెన్సీ మండలాలైన గుండాల, ఆళ్లపల్లి ఆశ్రమపాఠశాలలు మెరుగైన ఫలితాలు సాధించాయి. మామకన్ను, శంభూనిగూడెం, కాచనపల్లి ఆశ్రమ పాఠశాలలు నూరుశాతం ఫలితాలు సాధించాయి. మామకన్ను, శంభూనిగూడెం పాఠశాలలు గతేడాది కూడా 100 శాతం ఫలితాలు రాబట్టాయి. మామకన్నులో 18 మందికి 18 మంది పాసయ్యారు. కాచనపల్లి బాలికల పాఠశాలలో 51 మందికి 51 మంది పాసయ్యారు. శంభూనిగూడెం బాలుర ఆశ్రమ పాఠశాలలో 25 మందికి 25 మంది ఉత్తీర్ణులైయ్యారు. ఆళ్లపల్లి మండలంలో కేజీబీవీ పాఠశాలలో 45 మందికి 45 మంది ఉత్తీర్ణత సాధించారు. మర్కోడు బాలుర ఆశ్రమ పాఠశాలలో ఏడుగురికి ఏడుగురు పాసయ్యారు. ఆళ్లపల్లి జిల్లా పరిషత్ నుంచి 9 మందికి 9 మంది ఉత్తీర్ణత సాధించారు. దీంతో మూడు పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు సాధించారు.

ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాల, కేజీబీవీ..

మణుగూరుటౌన్: పదో తరగతి ఫలితాల్లో మణుగూరు మండలంలోని ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో 51మందికి 51మంది ఉత్తీర్ణులై 100శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ మేరకు ఎంఈఓ వీరస్వామి వివరాలు వెల్లడించారు.

కరకగూడెం: పది ఫలితాల్లో భట్టుపల్లి కేజీబీవీ పాఠశాలకు చెందిన 35 మంది విద్యార్థినులకు 35 మంది ఉత్తీర్ణత సాధించారు. దీంతో ఆ పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత నమోదయ్యింది. అలాగే జెడ్పీటీసీ అనంతారం పాఠశాల నుంచి 5 గురికి నలుగురు, భట్టుపల్లి జెడ్పీఎస్‌ఎస్ పాఠశాలలో 9 మందికి 8 మంది ఉత్తీర్ణత సాధించారు.

నూరుశాతంతో మైనారిటీ గురుకులం హ్యాట్రిక్..


షేక్ శంషాద్


ఐ.తేజశ్రీ

అశ్వారావుపేటరూరల్: పదో తరగతి ఫలితాల్లో మండల కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల నుంచి 31 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 31 మంది ఉత్తీర్ణత సాధించారు. 100శాతం ఫలితాలు నమోదు చేశారు. ఈ పాఠశాల వరుసగా మూడోసారి నూరుశాతం ఉత్తీర్ణత సాధించడం విశేషం. విద్యార్థినులు ఐ.తేజశ్రీ, షేక్ శంషాద్ అజ్మీ, ఎస్‌కే తస్లీం, ఎస్‌కే రేష్మ 9.3 జీపీఏ సాధించి సత్తా చాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సంగీత, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులను, అధ్యాపకులను అధికారులు అభినందించారు.

గిరిజన గురుకులాల్లో 86 శాతం..

పదో తరగతిలో ఆశ్రమపాఠశాలల్లో 77 శాతం ఉత్తీర్ణత

భద్రాచలం: పదో తరగతి ఫలితాల్లో గురుకులం విద్యార్థులు 86.13 శాతం, గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో 77, బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో 95 శాతం ఉత్తీర్ణత సాధించారు. ట్రైబల్ వెల్ఫేర్ హాస్టళ్లలో అతి తక్కువగా 60 శాతం ఉత్తీర్ణత నమోదయింది. ఈ మేరకు ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు వివరాలు వెల్లడించారు. జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో మొత్తం 1,836 మంది పరీక్ష రాయగా, 1,412 మంది ఉత్తీర్ణులయ్యారని, వీరిలో 638 మంది బాలురు, 774 మంది బాలికలు ఉన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు 266 మందికి 160 మంది పాసై 60 శాతం ఉత్తీర్ణత సాధించారు. బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో 37 మందికి 35 మంది పాసై 95 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. డి గొల్లగూడెం, అంకంపాలెం, పార్కలగండి, శంభునిగూడెం, మామకన్ను, కాచనపల్లి, మర్కోడు, రొంపేడు ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు 10 జీపీఏ సాధించారు. వీరిని పీఓతోపాటు పలువురు అభినందించారు.

గిరిజన గురుకులాల్లో

ఖమ్మం రీజియన్‌లోని గిరిజన సంక్షేమ గురుకులాల్లో 86 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 14 గురుకులాల్లో మొత్తం 1,074 మంది పరీక్ష రాయగా 925 మంది ఉత్తీర్ణ సాధించగా, 149 మంది ఫెయిలయ్యారు. సింగరేణి గురుకులం వంద శాతం ఫలితాలు సాధించగా, అతి తక్కువగా 60 శాతం ఫలితాలు పాల్వంచ గురుకులం సాధించింది. 10 జీపీఏ సాధించిన బోడ సతీష్, బానోత్ మోహన్ , ఎ.విజయలక్ష్మిలకు పీఓ ప్రత్యేక అభినందనలు తెలిపారు.